యమధర్మరాజు కొలువు కూటంలో

# న్యాయవిచారణ

కొక్కొండ వాసుభాస్కరరావు

'రాజా—చచ్చిపోయేడి, చచ్చినవట్టుబోతు శవాన్ని నన్ను మోసుకొస్తున్నావు పాపం! ఆయాసంతో యిలా అఘోరించకపోతే-ఎందుకొచ్చిన గొడవ? హాయిగా కాలుమీద కాలేసుకొని చందమామల్లాంటి బంగారు బొమ్మలతో విందు వినోదాలలో తేలియాడవచ్చు కదా. కడుపులో చల్ల కదలకుండా కూర్చొని తగుదునమ్మా అని తయారవుతావా వాగ్దానాలకు? సరే, ఏదో కులాసాగా యిచ్చావే అనుకో మాట-అదో సరదా కాని ఆ మాట పట్టుకొని వేళ్ళాడమని ఎక్కడుందయ్యా? పాపం వెర్రిబాగులాణ్ణి చేసి మాబాగా ఆడిస్తున్నారు నిన్ను.'

భేతాళుడు చెప్పుకుపోతూనే వున్నాడు. కాని విక్రమార్కుడుమాత్రం కిక్కురు మనుట లేదు. కొంపతీసి నోటివెంబడి 'ఆ' అనిగాని 'ఊ' అనిగాని వచ్చిందా అంటే చల్లగా జారిపోతాడు. ఊపిరి బిగబట్టి, చెవు లప్పగించి వూరుకున్నాడు విక్రమార్కుడు.

'సరే నువ్వు మాట్లాడవు. మా రోజుల్లో ఆడవాళ్ళు మాత్రమే మూగనోములు పట్టేవారు. ఇప్పుడదేమిటో గాని మౌన వ్రతమట. ఏ ఆదివారంనాడో వొకగంట. తలకాయ పగలగొట్టుకు చచ్చినా నల్ల రాతి బుద్ధ విగ్రహంలా కూర్చోవాలిట. కూర్చోవాలేమిటి.? కూర్చుంటున్నారు కూడా. ఖర్మం. ఏమయ్యా విక్రమార్కా ఆడవాళ్ళవ్రతాలూ అవీ మీరు సర్దుకుంటున్నారు కదా. మరి దాంతోపాటే నలభీమ పాకశాస్త్ర ప్రారంభ దినోత్సవం చేశారా ఏ మంత్రి వరుడినో ఆహ్వానించి.?

'మహారాజా - 'నస్త్రీస్వాతంత్ర్య మర్హతి' అనేదాన్ని చదివేవే, వేదాలు. వేదాంగాలు, శాస్త్రాలు, పురాణాలు, యిన్నిటిని తల్లక్రిందుగా, అడ్డదిడ్డంగా, కంఠోపాఠంగా వప్పచెప్పేయగలవే. మరేమిటి యీ గోలంతా? ఆడవాళ్ళ వ్రతాలు మీరు, మీ వ్యవహారాలు వాళ్ళు వకఫరా చేసుకున్నారేమిటి? ఓహో - సత్యాగ్రహం సాగించారు గాబోలు వుజ్జాయినీపుర నారీమణులు, సమాన హక్కులు గావాలని పురుషులతో పాటు.

'నీ నోట్లోంచి మాటే రాదు. నాకు పుల్‌స్టాపు లేనే లేదు. 'సఖ్యం సప్త పదాధీనం' అన్నారు పెద్దలు. ఏడు కాదు గదా ఏడేళ్ళ నలభైతొమ్మిదడుగులు నడచి వచ్చాము నువ్వు క్రిందా నీ భుజాల మీద నేనూ అనుకో. కాబట్టి మనమిద్దరం ప్రాణస్నేహితులమన్నమాట ఓ నా ప్రియ మిత్రుడా పాపం అలసి పోతున్నావు. నువ్వు నన్ను వదలవు. నేను నిన్ను వదలను. నాది భేతాళుడి పట్టు. నీది బ్రహ్మరాక్షసి పట్టు. సరే ఆయాస పడుతున్నట్టున్నావు! ఆహ్లాదం కలిగించే కథొకటి చెప్తా విను. వినేటప్పుడుమాత్రం కునికిపాట్లు పడకు.

'అనగనగా ఒక భూమివుందిట. ఆ భూమిలో ఒక ఖండముందిట. ఆ ఖండంలో వొక దేశముందిట. ఆ దేశంలో ఒక రాజ్యముందిట. రాజ్యంలో పట్టణాలు. పట్టణాలలో భవనాలు, సౌధాలు, యింకా ఏవేవో వున్నాయిట. వాటితో పాటే ఒక యిల్లుందిట. ఇల్లంటూ వున్నాక ఎలాగూ తప్పదుగా యింక. ఆ యింటికో యజమాని, అతగాడికో యిల్లాలు, ఆ యిల్లాలికకొందరు పిల్లలు వున్నారుట

పిల్లలెప్పుడు పిల్లల్లాగే వుంటారా? అందులో పెద్దది పెరిగి మరింత పెద్దదైందిట. 'ట' ఏమిటి నిజమే. ఆ అమ్మాయి కన్యగా వుండగానే ఎవరికో వొకడికి కాళ్ళు కడిగి, కన్యా దానం చేసి, ఆ కన్యదాన మహాఫలాన్ని మూటకట్టుకుందా మనుకున్నాడా కుటుంబీకుడు. కాని శారదా చట్టం

'అయ్‌అమ్మదొంగా' అనంగానే గుడ్లు మిటకరించాడు. ఆఅమ్మాయి పెరిగి పెద్దదై ఆకార విశేషాలలో అందమైనదైంది.

పిల్లలంటూ వున్నాక పెళ్ళంటూ చేయాలిగా! ఆ-ఎందుకులే అంటావేమో? గాలివాన వస్తే కథే లేదు. పిల్ల పెళ్ళికోసం తెగతిరిగి దానికి సరిపోయే పెద్ద మాట లేనందున నిరుత్సాహపడ్డాడు. అంటే పెళ్ళికొడుకులు బ్లాక్‌మార్కెటులో మాచెడ్డ గిరాకీరేటు సంపాదించారట.

పెళ్ళికాలేదా పిల్లకు కాని పప్పూ, పులుసూ తిన్నదాయెను. కొమ్మలు మొలిచాయనుకున్న శివుడే పార్వతీ దర్శనంతో పరవశుడైపోయి తనచేతగాని తనాన్ని యింకొకడెదురుగుండా వుండి చూచాడని చితకకొట్టేసి, యింకా కసితీరక కాల్చి బూడిదచేశాడే-చిన్నపిల్ల అప్పుడే వికసించిన కుసుమం. భ్రమరదర్శనం అయినా గూడా యెంతకాల మోపికపట్టి వుంటుంది?

ఎవరో ఒట్టి తండ్రి చల్లగా జేరుకున్నాడు తప్పుకుతూ తీరుతూ ప్రకృతి కుసుమసుందరి సౌందర్యాన్ని భ్రమరసుందరుడు పీల్చేసి మీసాలు సద్దుకుంటూ తోక ఝాడించాడు. మైకపు తెరలు తొలగిపోయాక మోసాన్ని గ్రహించింది.

అదేమిట్రా బాబూ కందులాంటి పిల్లను పాడుచేశావే అంటే లక్షా, డబ్భైవేల కారణాలను ఏకధాటిగా ఏకరువు పెడతాడు. చూశారా మీ అబ్బాయిచేసిన ఘనకార్యం అని ఆతడి తల్లిదండ్రుల నడుగుతే చాల్లే-ఎద్దులా ఏళ్లొచ్చిన మొద్దును వీధిలో వదిలేస్తే ఎంతమంది తమ కుర్రకుంకల్లాంటి అమాయకులు దానికి బలైపోతున్నారో అని విచారం సూచించారు. ఆ పిల్ల తండ్రి 'ఏదీ గతినాకూ' అనిఆరున్నొక్కరాగం ఆలాపించాడు.

కాలం గడచింది. పుట్టుట గిట్టుటకొరకే అని ముందుగా పిల్ల తల్లిదండ్రులూ, పిల్లవాడి తల్లిదండ్రులు జేరుకున్నారు, ధర్మపు ముసుగు ధరించిన యమలోకానికి. ముద్దాయిలు నలుగుర్నీ న్యాయస్థానానికి జేర్చారు. ఇంకా యిద్దరు మిగులుండుటవలన కేసు వాయిదా వేయబడింది.

మరి కొంతకాలానికి యీ ఇద్దరూగూడా చేరుకున్నారు ప్రధాన న్యాయస్థానాన్ని. దోషులారుగురూ యమధర్మరాజు ముందు నిలబెట్టబడ్డారు.

'చిత్రగుప్తా! ఎవరోయ్ యీ మహాత్ములు. వీరొనర్చిన ఘనకార్యమేమిటి! ఈ మహానుభావుల దివ్యదర్శనంతో రోజూ మన జన్మ పావనం అయిపోతూంది'అని అడిగేడు ధర్మావతారుడు.

'మహాప్రభూ! ఈ దుర్మార్గులు, నీచులు, పాపులు, ఎట్సెట్రా-వీరు చేసిన దురంతాని కంతులేదు. వీరి మూలమున ధర్మదేవత నాలుగుపాదాలతో నడవడం దేవు డెరుగు, తలక్రిందులుగా డేకలేక వుక్కిరిబిక్కిరి అయిపోతూంది. వీళ్లు సమాజానికీ, మానవ అభ్యుదయానికీ చెదపురుగులు. వీళ్ళకు కఠోరదండన విధించి తీరవలసిందే' అని సిఫార్సు చేశాడు చిత్రగుప్తుడు.

చూసిరమ్మంటే కాల్చి వచ్చాడుట. వీళ్ళు ఏం పాపం చేశారయ్యా అంటే వీళ్ళని చావగొట్టి చెవులు మూయాలంటాడు హెడ్‌క్లర్కుగారు.

'ముద్దాయిలు చెప్పుకోవలసినదేమన్నా వుందా'అన్నారు న్యాయాధిపతిగారు, అందరూ ఏకగ్రీవంగా ఉందంటే వుందన్నారు. కాని కర్మవశాత్తు ఉద్రేక, ఆవేశాలతో కాస్త తొందరపడ్డారేమో ధర్మరాజుగారి ముఖకమలం వర్షానికి తడిసినట్లయింది.

'ఒరేయ్ వీళ్లను కాస్త దూరంగా తీసుకెళ్లండిరా బాబూ' అన్నాడు ధర్మరాజు. చిత్తం, చిత్తం అని యీడ్చుకువెళ్లేరు స్వామి భక్తులు.

'ఒకటో ముద్దాయి....పిల్లతండ్రీ.......ఏమయ్యోయ్ ప్రభువులతో చెప్పేదేమన్నావుంటే చెప్పుకోవయ్యా' హెచ్చరించాడు స్వామి భక్తుడు.

పిల్లతండ్రి వచ్చి లోపల తిట్టుకుంటున్నా పైకిమాత్రం న్యాయాధిపతికి నమస్కారం చేసి ప్రారంభించాడు. కాని యింతలో యముడికనుమానం వచ్చింది. 'చిత్రగుప్తా వీడు నిజం చెప్తాడో, అబద్ధం చెప్తాడో! భగవంతుడిమీద ప్రమాణం చేశాక ఆ చెప్పేదేదో చెప్పమను' అని తన వుద్దేశం తెలియజేశాడు. 'అబ్బే అవి పాతకాలపు రోజులులెండి' అని సర్దిచెప్పేడు చిత్రగుప్తుడు.

పిల్ల తండ్రి చెప్పడం సాగించాడు,

'మాదో మధ్యతరగతి కుటుంబం. ఘడియలు, గంటలు లెక్కబెడుతూ రేపటి మాటేమిటా అని ఆలోచించే స్థితి మాది. ఆశ, అదృష్టం మమ్మల్నసహ్యించుకొని దూరంగా తొలగిపోయాయి. దీనిని చూడగానే అయ్యో పాపం అని జాలితలచి దరిద్రం, శని మమ్మల్నావహించాయి.

'మా నాన్న తెచ్చే జీతంతో...'

'మీనాన్న సంగతెవడికి కావాలి? నీసంగతి చెప్పు' అన్నాడు యముడు.

'అదేనండి. చిత్తగించండి. మానాన్న తెచ్చిన జీతంతో నెలకి యిరవైరోజులు ఏదో వున్నంత తిని మిగిలిన పదిరోజులూ మా కుటుంబమంతా కాళ్ళుచాచుకు పడుకునేది. అలాంటి వాతావరణంలో నేను ఎలాగో ఒకలాగ మెట్రిక్యులేషన్ వరకు గట్టెక్కించాను. అక్కడినుంచి రథం ఎంతగింజుకున్నా కదలలేదు, నాటినుంచి నేటివరకు అక్కడే చతికిలపడి కూర్చుంది.

'నా కప్పటికో పద్దెనిమిదేళ్లుంటాయి. నా గురించి ఎన్నో పెళ్ళిసంబంధాలు వచ్చేవి. అదే విధంగా ఒక పెద్దమనిషి కూడ వచ్చేడు. చదివినది మెట్రిక్యులేషన్, ఆస్తి బండి చక్రం. ఉద్యోగం శూన్యం. అప్పటి నాస్థితి ఏమిటంటే నడుములు వంగిపోయిన మానాన్న మెడకు గుదిబండలా వ్రేలాతూవున్నాను.

'ఇది మన గుణగాణాలు. అన్నీ విన్నాడా వచ్చినాయన. నాలో ఏం ప్రత్యేకత కనబడిందో ఏమిటో తన పిల్లను నాకిచ్చి పెళ్ళి చేస్తానన్నాడు. మానాన్న మొదట బెట్టుచేసి చివరికి లాంఛనాల పేరిట రెండువందల కట్నం యిచ్చితీరాలన్నాడు. ముందుగా కొంచెం నసిగినా దానికి ఆయన వప్పుకొని తాంబూలాలు పుచ్చుకొని వెళ్ళిపోయాడు. నాలో నాకు తెలియని ప్రత్యేకత ఏదో వుండి తీరుతుందనుకున్నానప్పుడు.

'మా ఆవిడ కాపురానికి వచ్చింది. ఆవిడ యింట్లో అడుగుపెట్టిన 'వేళావిశేషం' వల్ల నాకో నలభయిరూపాయల వుద్యోగం దొరికింది. కుంటుకుంటూ బండి కదులుతూంది. ఉన్ననాడు తిని లేనినాడు కడుపులో కాళ్ళు పెట్టుకోడం అలవాటేగా.

'నాకు ముప్ఫయిఆయిదేళ్లు వచ్చాయి. ఆరుగురు ఆడసంతానం. పెద్దదానికి ఎనిమిదోఏడు. పెళ్ళిచేద్దామనుకున్నాను. కాని ఎవరో కిట్టనివాళ్ళు శారదాచట్టం పేరిట గవర్నమెంటుకు రిపోర్టు చేశారు. పెళ్ళి ఆగిపోయింది.

'అమ్మాయి పెద్దదైంది. దీనికి పెళ్ళి చేయడమెలాగా అని బెంగైపోయింది తల్లికి. ఎవరినడిగినా మా అబ్బాయి కిష్టంలేదు. కట్నమేపాటీయగలరు? బాలతొడుగేమన్నా వుందా? యిదీ వరస. ఏంచెయ్యడం? తల వంచుకొని వెనక్కి తిరిగి వచ్చేసేవాడిని. పిల్లకు పద్దెనిమిదేళ్లు నిండాయి! ఇరుగుపొరుగువాళ్ళ ఆర్భాటం ఎక్కువైంది. చీటికీ మాటికీ ఎత్తిపొడవడం మొదలెట్టారు. కాని అశక్తుడేం చేయగలడు చాటుకుపోయి కళ్ళనీళ్ళు తుడుచుకొని దుఃఖం దిగమింగుకునేవాడిని.

రోజులు గడిచాయి. ఒకరోజు తెల్లారి చూసేటప్పటికి అమ్మాయి కనబడలేదు. తెగ వెతికేశాం. చివరికి - తానెవరినో ప్రేమించిందనీ, అతనితో వెళ్లిపోతున్నదనీ రాసిపెట్టిన వుత్తరం కనబడింది. నిలువునా నీరైపోయాం. ఆగి ఆగి ఆడుతున్న గుండెమీద అమాంతంగా బండరాయి పడింది. కళ్ళల్లో నీళ్లున్నంతవరకు ఏడ్చింది దాని తల్లి. బెంగపెట్టుకుని మంచమెక్కింది. దానికెప్పుడూ వొకేగోల, మిగిలిన అయిదుగురి పెళ్లి ఎలా చేయాలిరా భగవంతుడా అని.

'వూరు వూరంతా ఏకమై నోరు నెప్పెట్టే వరకూ ఆడిపోసుకున్నారు నన్నూ, నా కుటుంబాన్నీ. అందరూ వేలెత్తి వెక్కిరించే వాళ్ళే... మిగిలిన పిల్లలకు పెళ్ళిఅవలేదు. వాళ్ల జీవితంలో పడ్డపాట్లు యీ నా నోటితో నేను చెప్పలేను. యుక్తవయసు వచ్చిన పెద్దదానికి పెళ్ళిచేయని కారణంవల్ల యింత నాశనం సంభవించిందనీ, ఆరు ప్రాణాలు అల్లల్లాడి పోయాయనీ, కాబట్టి దీనితప్పు అంతా నాదేననీ అంటున్నారు చిత్రగుప్తులవారు. నేను చెప్పేదేదో చెప్పేశాను. ఆపైన మీయిష్టం'-అని విరమించాడతడు.

'రెండో ముద్దాయి... పిల్లతల్లీ... నువ్వేమన్నా చెప్పుకుంటావా' అడిగాడు స్వామిభక్తుడు.

'నే చెప్పేదంతా ఆయనే చెప్పేశారు' అని ఆమె ఊరుకుంది.

'సరే అయితే ముద్దాయి నెంబరు మూడు... మూడో ముద్దాయి...పిల్లాడి తండ్రి. ఏమయ్యో త్వరగా నువ్వు చెప్పేదేదో చెప్పేసేయ్...'- స్వామిభక్తుడి ఆజ్ఞ.

'అయ్యా సావధానంగా చిత్తగించండి' అని మొదలు పెట్టేడతడు.

'అయ్యా మేము పెద్దింటి బిడ్డలమండి. మా యింట్లో డబ్బు మూలుగుతూంటుం దండి. ఆ డబ్బును చూసి ఆ అమ్మాయి మా అబ్బాయి వెంటబడి వేటాడేసిందండి. మీదబడితే కాదన లేక కళ్లు మూసుకొని గడిపేశాడు బాబూ కాలం. తరువాత - యింకా అక్కడేవుంటే అంతం చూసేవరకూ వదలదని ఎలాగో వీలు చేసుకొని తన్నిరక్షించుకొని మమ్మల్ని కాపాడే డండి మా అబ్బాయి. ఏదో గౌరవంగా బ్రతికిన వాళ్ళం మీరు మానంగతి గ్రహించి మమ్మల్నో కంట కనిబెట్టాలి.'

అంతట్లో అందుకుంది ఆయన భార్య.

'అంతేనండి. మావాడుత్త అర్భకుడు. అమాయకుడు. ఎవ రేది చెప్తే అంతే. అస్తమానం వీధి గుమ్మాన్నంటి పెట్టుకొని మావాడు రాగానే వెంటబడితే కాదనలేక పోయాడు. జాలిగుండె గలవాడు. ఇంకో సంగతి చూశారూ! అదిగనుక అలా లేచి రాకపోతే మావా డెప్పు డైనా అలాంటిపని ఒడిగడతా డంటారా?'

'మీవాడే లేకపోతే అసలీ కేసెలా జరిగి యుండే దేమిటి' ఎగిరిపడ్డాడు పిల్ల తండ్రి.

'అయ్యా వాణ్ణి కొంచెం తమాయించమనండి. పోనీ ఆ మాయదారి దాన్ని తెచ్చి యింట్లో పెట్టుకున్నా మనుకోండి. నాకూ పెళ్లి కావల సిన ఆడపిల్ల లున్నారు. వాళ్ళ గతి ఏంకాను? లేచిపోయొచ్చిన దాని అత్తగారు...అని రేపటి వియ్యపురాలంటే ఎలా చెప్పండి భరించడం? పరువు ప్రతిష్ఠలతో పెరిగిన కుటుంబ గౌరవం నేలపాలైపోతుంది. అబద్ధమాడైనా కొంప నిల బెట్టమన్నారు గాబట్టి మా అబ్బిగాడికీ, మీ కుర్రదానికీ ఏమీ సంబంధం లేదుపో అని తరి మేశాను.

'కాబట్టి—ఆతప్పు నాకూ, మా యింటాయ నకూ, పాపం పేరిట అంటగడుతున్నాడు మీ చిత్రగుప్తుడు. కొంచెం న్యాయమాలోచించండి' అని చల్లగా ఊరుకుందావిడ

తరువాత పిల్లవాడు చెప్పడం ప్రారంభిం చాడు.

'ధర్మప్రభూ - సభాసదులారా నేను చెప్పిన మాటలువిని నన్ను నిర్దోషిగా తెలుసుకోండి. అలా అనవసరంగా కృశించి నశించిన ఆరు ప్రాణాలనష్టానికి నేమాత్రం కర్తను గాదని చెప్ప వలసి వస్తుంది. ఆడది కనిపించకపోతే మొగాడి కెన్నిగుండెలున్నాయంట అలాంటి వ్యవహా రాల్లో తలదూర్చడానికి?-!!

'నేనారోజున వాళ్ల వీధివెంబడి వెళ్తున్నాను. దైవవశాత్తు ఆపిల్ల నాకు గుమ్మంలో కనబడింది. అసలే నేను అందమైనవాడినని నా అభిప్రాయం. అందులో ఆరోజు కొంచెం దిట్టంగా పోటా తగి లించానేమో ఆపిల్ల నన్ను రెప్పవాల్చకుండ చూసింది. నాతక్కువేమిటని నేనూ చూశాను. అప్పటినుంచి రోజూ నేనాదారిని వెళ్ళడం, నే వెళ్లేసమయానికా అమ్మాయి గుమ్మంవద్ద హాజ రవడం జరిగేవి. ఆ అమ్మాయి జడ అల్లుకుంటూ కిటికీదగ్గిర, నేను సిగరెట్ దమ్ములాగుతూ రోడ్డు పక్కనున్న తూముమీద. యిలా గడిచిపోయింది కాలం.

'ఒకరోజున ఏదో యింగ్లీషు పిక్చరు చూడ గానే ఉద్రేకం ఎక్కువైపోయి ధనామని నా కవిత్వమంతా వుపయోగించేసి ఆపిల్లకు ప్రేమ సందేశం పంపించాను. డూడూ వెంకన్నా అంటే అంతేలే అన్నా అని తలూపింది. ఉద్రే కంలో ఊరువిడచి వెళ్ళిపోయాం.

'కొన్నిరోజులు గడిచాక కళ్ళు తెరచాను. చేసినపనికి సిగ్గుపడిపోయాను. ఇంట్లో అమ్మా నాన్నా ఏమంటారో అని ఆదో అనుమానం. ఏమైతేఅయిందని ఆ అమ్మాయిని మేం బస చేసిన హోటలులో నేవుంచి యింటికి బయలుదేరేను డబ్బు తెద్దామని. జరిగిన సంగతంతా చెప్పేను. నా నిర్ణయం కూడ చెప్పేశాను. నోరెత్తితే డొక్కచింపేస్తామన్నారు యింట్లో. ససేమిరా వినలేదు. మరునాడు మానాన్న పిలిచి 'ఒరేయ్- అదేం పతివ్రతనుకున్నావా? నీతో వచ్చేది మరో

కడితో మాత్రం ఎందుకుపోదు? అదంతా నీదగ్గర నుంచి డబ్బు గుంజుకోడానికి వేసినఎత్తు. నువ్వు దానికెన్నోవాడివో!' అన్నాడు. దాంతో బుర్ర గిర్రునతిరిగిపోయింది. మళ్ళీఆమాటతలబెట్టలేదు'.

ఇందులో ప్రధానభూమిక నిర్వహించిన ఆ అమ్మాయి తన చరిత్ర సాగించింది.

'చిన్నప్పుడే నాకు పెళ్ళిచేద్దామనుకున్నారు. ఖర్మంకాలి పెళ్లి తప్పిపోయింది. పెళ్ళి-మొగుడు అనేపదాలను నాకుతగిలించి వాళ్లనుకునేమాటలు నాకు కలవరం, సిగ్గూ కలుగజేసేవి. ఆ సిగ్గు క్రమంగా అభిమానంగామారి ఆపదాలకు మహత్తరార్థాన్ని అన్వయం చేసుకున్నాను. తీయటి కలలుకన్నాను. దౌర్భాగ్యానికి తోబుట్టువునైన నాకలలు కథలుగానే మిగిలిపోయాయి. చివరికి నాకీజన్మలో పెళ్ళే అవదా అనే అనుమానం భయం, ఆవేదన ఆవరించాయి నన్ను.

'ఆరోజున ఎందుకో వీధిగుమ్మంలోకొచ్చాను. ఎవరో అందమైన కుర్రాడు రెప్పవాల్చకుండా నావైపు చూస్తున్నాడు. అకస్మాత్తుగ నాకు తెలియకుండానే నాకాళ్ళు నన్ను లోపలికి తీసుకుపోయాయి. పదినిముషాలు గడిచాక నాకోసం ఆపిల్లాడు అక్కడేవున్నాడా, లేదా చూడాలనే కుతూహలం కలిగింది, వచ్చి చూస్తే అక్కడే గుమ్మంవైపు చూస్తూ నిలబడివున్నాడు. మళ్ళీ వెనక్కితిరిగిపోదామనిబుద్ధిపుట్టిందిగాని ఎందుకో వెళ్ళలేకపోయాను. అతని కళ్ళలోకి చూస్తూ నిలబడిపోయాను. అతడు అనిమిషుడిలా నా శరీరంలోని ప్రతీ అణువుణూ శోధించేస్తున్నాడు. అలాగే వుండిపోతే బాగుండు ననిపించింది అతడు చిరునవ్వు నవ్వేడు. నాకు తెలియకుండానే నేనూ నవ్వేను. తర్వాత విడిపోయాం.

'ఈ సంఘటన నా మనస్సును కలచివేసింది. యౌవ్వనపు పొంగులతో వున్న వుడుకు రక్తం మనోబలాన్ని మాపివేసింది. ఆ రోజంతా ఆలోచనలతో గడిపేశాను మరునాడు మళ్లీ అతడాగమయాని కక్కడకు వస్తాడా అనే సందేహం కలిగింది. కాని ఆ రోజేకాదు ప్రతీరోజు, ప్రతీగంటా అతడలా వస్తూనేవున్నాడు. ఒక రోజున రాయికో కాయితంకట్టి నామీదకు విసిరి, వెనక్కి తిరిగిచూడకుండా వెళ్ళిపోయాడు. ఉత్తరం చదివేను. గుండెలు అతివేగంగా కొట్టుకొంటున్నాయి. నీ అందంలో నేనో ఓ నన్నాడు. నీవు లేకపోతే ప్రపంచమే లేదన్నాడు. నీకాలికిందబానిసనన్నాడు. పెళ్ళిచేసుకుంటానన్నాడు. ముద్దులతో ముగించాడు లేఖను.

'పరవశురాలనైపోయాను. గుండె బరువెక్కిపోయింది. ఇంట్లో చెప్పకుండా అతనితో వెళ్ళిపోయాను. తల్లిదండ్రులు బాధపడుతారనుకున్నానుగాని చివరకి చెబితే చాలు సంతోషిస్తారని పొంగిపోయాను. మేమిద్దరం ఒక హోటలులో బసచేశాం. ఒక వారంరోజులలో చేతిలోని డబ్బయిపోయింది. డబ్బుతెస్తానని వెళ్లేడు అతనిని వదలడాని కెంతో బాధ పడిపోయాను. మరో రెండురోజులవరకు అక్కడే అతనిరాక కెదురుచూస్తూ వున్నాను కాని, అతడు రాలేదు. ఇకరాడని గుర్తించా ఆశ నిరాశచేసుకున్నా మత్తు వదలిపోయింది. కళ్ళుతెరచి లోకం నేర్పిన మొదటిపాఠాన్ని వల్లెవేశాను.

'చేసేదిలేక మనోవేదనతో ఇంటికి వెడదామని బయలుదేరాను. హోటలువాడు డబ్బడిగి నిరుత్తరనైన నన్ను చూసి జీవితమహానాటకంలో కీచకపాత్ర ధరించాడు. వాడి కళ్లల్లో దుమ్ముగొట్టి చచ్చి చెడి ఇల్లు చేరుకున్నాను.

'నేను ద్రోహిని, పాపిని. కర్కశహృదయం నాది. నావల్ల నా చెల్లెళ్లు నాశనం ఐపోయారు. తల్లిదండ్రులు కుళ్ళికుళ్ళి ఏడ్చారు. నేను పుట్టి కట్టుకున్న పుణ్య మేమిటంటే సర్వనాశనం చేయడం.

'ఈపాపాని కంతటికీ మూలకారణం నేను. ఆ అమాయక ప్రాణాల్ని దారుణ హింసలపాలు చేసింది నేను నన్ను హింసించండి. యమలోకంలో మీకెన్నిహింసలు తెలుసో అన్నివిధాలా నన్ను హింసించండి. నాకు విముక్తిలేదు-' అని విచారంతో తనకథముగించిం ఆఅమాయకపుపిల్ల.

'ఆప్తబంధువుల విపత్పరంపరలను చూసి దుఃఖంతో మనసు వెడి. నిన్ను నీవు మోసగించుకొని నీవే దోషివని చాటుకుంటున్నావు" బట్టి లోకం నిన్ను లోకువచేసిం ద'నుకున్నాడు యముడు.

రాజా-విన్నావుగదా జరిగిన సంగతి. పరిస్థితులకు లొంగిపోయే మనో దౌర్బల్యం గల అమాయిక;-

ఆడపిల్లకు యుక్తవయస్సు వచ్చినా పెళ్ళి చేయలేని తల్లిదండ్రులు;-

ప్రవాహవేగంలో ఎదురీదలేక వడిలో పడి కొట్టుకుపోయే ఉద్రేకి యగు యువకుడు;-

పరువు, మర్యాదల పేరుతో, తమకేదైన ముప్పు వస్తుందని ఆరాటంతో ఎంతకైనా చేయగలిగిన తల్లిదండ్రులు;-

ఈ భయంకర వాతావరణాన్ని కల్పించిన మహాశక్తి;-

ఫలితం మానవత్వానికి మాయని మచ్చయైన ఆరు ప్రాణాలు అనుభవించిన దారుణ మరణవేదన;

'ఆలోచించు వీళ్ళలో ఎవరు దోషి? ఎవరి వల్ల యీ నాశనం సంభవించింది? తెలిసికూడ చెప్పకపోతే ఎరుగుదువుగా శాపం?'—బేతాళుడు ప్రశ్నించాడు.

'ఉన్నతల తన దనుకొని ఆలోచించే ప్రతీవాడికీ అర్థమయి తీరుతుం'దన్నాడు విక్రమార్కుడు.

'అలాగుటోయ్ పెద్దమనిషీ' అని భేతాళుడు చల్లగా జారుకున్నాడు

తర్జన భర్జన

# నిష్పాక్షిక పరిశీలన ఎంతైనా అవసరం

కనకమేడల వెంకట్రామయ్య

సెప్టెంబరు 1వ తేదీ 'తెలుగు స్వతంత్ర'లో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ శ్రీ సి.ఇ ఆర్ గారు వ్రాసిన వ్యాసాన్ని తరువాతి సంచికలో నేను విమర్శించగా, 22వ తేదీ సంచికలో 'ఇది అవినీతికాక మరేమిటి?' అని ప్రశ్నిస్తూ శ్రీ అశ్వని గారు ప్రతివిమర్శ చేశారు. వ్యక్తిగతంగా నన్ను గురించి శ్రీ అశ్వని ఏ అభిప్రాయం వెలిబుచ్చినప్పటికీ, కాంగ్రెసుపట్ల నిష్కల్మషమైన భక్తి ప్రపత్తులుగలవాడి నవటంచేత, కాంగ్రెస్‌పట్ల కాంగ్రెస్‌వారు కాక యితరుల విమర్శనలను సహించలేని పిరికివాణ్ణిగా నన్ను శ్రీ అశ్వనిగారు చిత్రించటానికి పూనుకున్నారని, నన్ను గురించి ఆయన పొరబాటు అర్థం చేసుకున్నారని చెప్పటానికి చింతిస్తున్నాను.

'మాట వరసకు శ్రీ సి.ఇ. ఆర్ నెహ్రూగాని, పటేలుగాని, మెహతాబ్‌గాని, టాండన్‌గాని అయివుండి విమర్శిస్తే శ్రీ వెంకట్రామయ్యగారికి ఆపోహలు కలుగవని మనం పూహించవచ్చు' అని అంటున్నారు. మాట వరుసకే అనుకుందాం శ్రీ సి. ఇ. ఆర్ పైవారిలో ఎవరైనా అయివుంటే అంత బాధ్యతారహితంగా మాట్లాడగలరని శ్రీ అశ్వనిగారు చెప్పగలరా? దురదృష్టవశాత్తు శ్రీ సి.ఇ. ఆర్ పైవారిలో ఒక్కరుకూడా కాలేకపోయారు. ఎందువల్లనంటే నెహ్రూ కాంగ్రెస్ కుళ్లుకంపు కొడుతోంది అన్నా, పటేలు విమర్శించినా, ఇంకెవరుచెప్పినా నిర్మాణాత్మకంగా విమర్శిస్తూ, తప్పులను సరిదిద్దుకోటానికి ఏవైనా సూచనలుచేస్తే-కాంగ్రెస్‌వారే కాదు - యితరులెవరైనప్పటికీ ఆ విమర్శనను హృదయపూర్వకంగా స్వీకరించవలసి వుంది. కాని శ్రీ సి. ఇ. ఆర్ వాదనలో అదెక్కడా కనుపించదు. స్వతంత్రందేశంలోని పౌరునిగా ఏపార్టీకి చెందినప్పటికీ ప్రభుత్వ విధానాలలోని అవకతవకలను విమర్శించి వాటిని సర్దుకోవటానికి కొన్ని సూచనలుచేస్తూ ప్రభుత్వాన్ని అది ఏ పార్టీకి చెందినప్పటికీ విమర్శించటానికి హక్కుందనే విషయం నాకు తెలియకపోలేదు. స్వతంత్రదేశంలో మనం అనుభవించటానికి పౌరహక్కులను కోరుతున్నాం. కాని దేశంపట్ల, ప్రజలపట్ల మనకున్న విధులను, బాధ్యతలను